క్లుప్తంగా

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణమూర్తి

గుర్ల: ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణమూర్తి అన్నారు. డిపాజిటర్ ఎడ్యుకేషన్, అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయంలో బ్యాంకింగ్ సేవలపై డ్వాక్రా సంఘాల సభ్యులకు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలు అధికంగా జరుగుతున్నాయని, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వెలుగు ఏపీఎం భారతి, అధికారులు ఎం. సూరిబాబు, హరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడి



పోతంపేటలో అవగాహన కల్పిస్తున్న ఏడీ విజయ

లక్కవరపుకోట: ఏ పంటకైనా సస్యరక్షణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ ఏడీ ఎల్.విజయ అన్నారు. మండలంలోని పోతంపేట, నర్సంపేట గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు మినప, పెసర పంటల్లో సస్యరక్షణ చర్యలపై ఆమె అవగాహన కల్పించారు. మినప, పెసర పంటలకు ఎకరానికి 10 కిలోల యూరియా, 5 కిలో పొటాష్ కలిపి వేయాలని చెప్పారు. దీని వల్ల భూమిలో ఇవక లాగి మొక్కకు పోషకాలు అందుతాయన్నారు. పెసర, మినప పంటలకు బీమా చేయించుకునేందుకు ఈనెల 31వ తేదీ వరకు గుడువు ఉన్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని, రైతులు వరి నూర్పులు చేపట్టవద్దని సూచించారు. ఏఓ స్వాతికుమారి పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో ద్వితీయ స్థానం



విద్యార్థి అరవింద్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న డిప్యూటీ డీఈఓ వెంకటరమణ

వేపాడ: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సంస్కృతి పాఠశాలలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో బక్కునాయుడుపేట మోడల్ స్కూల్ విద్యార్థి మైచర్ల అరవింద్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కె.వెంకటరమణ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నాడు. విద్యార్థిని హెచ్ఎం రావాడ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు

బొండపల్లి: మార్గశిర బహుళ నవమి సందర్భంగా దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి ప్రభలు, ఘటాలు, మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

అవగాహనతో క్షయ అంతం



మెరకముడిదాం: ఎస్ఎంఎస్ పరిశ్రమ కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యసిబ్బంది

మెరకముడిదాం: అవగాహనతోనే ప్రాణాంతక క్షయ వ్యాధిని అంతం చేయగలమని బాడంగి టీబీ యూనిట్ సూపర్ వైజర్ రమేష్ అన్నారు. జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గర్భాం ఎస్ఎంఎస్ పరిశ్రమ సమీపంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యసిబ్బందితో కలిసి కార్మికులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో పనిచేసేటప్పుడు వచ్చే దుమ్ము, ధూళి నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. టీబీ వ్యాధి లక్షణాలను వివరించారు. అనంతరం కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. వైద్యాధికారులు ఏ.అజయ్‌కుమార్, సీహెచ్.ప్రశాంతి, పరిశ్రమ ప్రతినిధులు ఉప్పు శ్రీను, పక్కిశ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బొండపల్లి: ప్రాణాంతక క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని దేవుపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అన్నారు. దేవుపల్లి,కనిమెరక గ్రామాల్లో మంగవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రోజుల తరబడి తగ్గకుండా దగ్గు వస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎంపీహెచ్ఈఓ బి.ఎన్.అప్పలనాయుడు, టీబీ సూపర్‌వైజర్ ఎన్.రాము,ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బీమా...లేదు ధీమా!

- మామిడి పంటకు బీమా చేయించుకునేందుకు ముందుకు రాని రైతులు
- నియోజకవర్గంలో 4,350 ఎకరాల్లో మామిడి పంట సాగు
- ఇంతవరకు బీమా చేయించింది 1,037 ఎకరాలకే
- ఇప్పటికే రెండుసార్లు గడువు పొడిగింపు
- 2014 నుంచి 2019 మధ్యలో ప్రీమియం చెల్లించినా అందని బీమా
- బీమా వస్తుందన్న నమ్మకం లేకే రైతులు వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం



మెరకముడిదాం సమీపంలో మామిడి తోటలు

చీపురుపల్లి: నియోజకవర్గంలో మామిడి పంట సాగు చేస్తున్న రైతులు వాతావరణ ఆధారిత పంట బీమా చేయించుకు నేందుకు వెనుకాడుతున్నారు. పంటకు బీమా చేసుకునే సదుపాయా న్ని ప్రభుత్వం కల్పిస్తోందని, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటకు నష్టం వాటిల్లితే బీమా చేయించిన రైతులకు నష్టపరిహారం అందుతుందని గత కొంత కాలంగా ఉద్యానవనశాఖాధికారులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. మామిడి సాగు చేస్తున్న రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అంతా బాగానే ఉన్నప్పటికీ మామిడి పంటకు కల్పిస్తున్న బీమాపై మాత్రం రైతులకు ఎందుకనో నమ్మకం కలగడం లేదనే తెలుస్తోంది. ఇప్పటికే బీమా ప్రీమియం చెల్లించేందుకు ఇచ్చిన గడువు పూర్తవ్వగా మరోసారి గడువును పొడిగించారు. అయినప్పటి కీ రైతుల నుంచి మాత్రం స్పందన అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. దీనికి కారణం గతంలో టీడీపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరే కారణమన్న మాట రైతుల నుంచి వినిపిస్తోంది. ప్రీమియం చెల్లించినప్పటికీ ఒక వేళ పంటకు నష్టం వాటిల్లితే బీమా పరిహారం ప్రభుత్వం అంది స్తుందన్న నమ్మకం కలగడం లేదని పలువురు రైతులు అంటున్నారు. 2014 నుంచి 2019 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఇలాగే బీమా కోసం ప్రీమియం చెల్లించినప్పటికీ పంటకు నష్టం వాటిల్లినప్పుడు ఒక్క రూపాయి కూడా పరిహారం అందలేదని కొందరు రైతులు గత అనుభవాలను చెబు తున్నారు. 2014 నుంచి 2019 మధ్య పంట బీమా విషయంలో జరిగిన పరిణామాలు తెలిసిన రైతులు నమ్మక లేక పోవడంతో పాటు తాజాగా మళ్లీ అదే ప్రభుత్వం ఉండడంతో బీమా ప్రీమియం చెల్లించేందుకు ముందుకు రావడం లేదనే చర్చ సర్వత్రా జరుగుతోంది.

4,350 ఎకరాలకు.. ప్రీమియం కట్టింది 1037.50 ఎకరాలకే

నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో రైతులు 4,350 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. ఇంతవరకు ఈ నాలుగు మండలాల్లో 1037.50 ఎకరాల పంటకు మాత్రమే బీమా కోసం రైతులు ప్రీమియం చెల్లించారు. మామిడి సాగు చేస్తున్న రైతులు తమ పంట అకాల వర్షాలు, చీడ, పీడలు, అననుకూల వాతావరణం, ఉష్ణోగ్రతలో వ్యత్యా సం, అధిక గాలివేగం తదితర కారణాల ద్వారా పంట నష్టం జరిగితే రైతులకు బీమా చెల్లించేందుకు అగ్రికల్చర్ ఆఫ్ ఇండియాతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి రైతులు ఎక రానికి రూ.2 వేలు ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ప్రీమియం చెల్లించేందుకు తొలుత 2024 డిసెంబర్ 15న వరకు గడువు విధించారు. అప్పటికీ రైతులు ముందుకు రాకపోవడంతో ఆ గడు వును 2024 డిసెంబర్ 31 వరకు పొడిగించారు. అయినప్పటికీ రైతులు నుంచి ఎలాంటి స్పందన కనిపించడం లేదు.

నియోజకవర్గంలో మామిడి పంట సాగు విస్తీర్ణం... ఇంతవరకు రైతులు బీమా కోసం ప్రీమియం చెల్లించిన విస్తీర్ణం వివరాలు(ఎకరాల్లో)...

మండలం	సాగువిస్తీర్ణం	రైతులు	ప్రీమియం చేయించిన విస్తీర్ణం
చీపురుపల్లి	750	2,500	157.5
గరివిడి	1,200	3,500	200
మెరకముడిదాం	2,000	5,000	600
గుర్ల	400	1,500	80
మొత్తం	4,350	12,500	1037.5

అవగాహన కల్పించాం....



మామిడి పంటకు సంబంధించి ప్రభుత్వం కల్పిస్తున్న బీమాపై రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాం.రైతులు ప్రీమియం చెల్లించేందుకు ప్రభుత్వం గడువు కూడా పొడిగించింది. మామిడి రైతులకు నేరుగానే కాకుండా ఫోన్ ద్వారా కూడా బీమా పథకం కోసం వివరించాం. నియోజకవర్గంలో 4,350 ఎకరాల్లో మామిడి సాగుచేస్తుండగా, ఇంతవరకు 1037.50 ఎకరాల పంటకు మాత్రమే రైతులు ప్రీమియం చెల్లించారు. పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్.చంద్రశేఖర్, ఉద్యానవనశాఖాధికారి, చీపురుపల్లి

విద్యుత్ చార్జీల భారంతో ప్రజల నడ్డి విరుగుతోంది

- విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట
- 27వ తేదీన నియోజకవర్గ కేంద్రంలో ర్యాలీ, నిరసన
- పోరుబాట వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే కడుబండి



పోరుబాట వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, తదితరులు

కొత్తవలస: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని మోయలేక ప్రజల నడ్డి విరుగుతోందని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ ఈనెల 27న నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మండలంలోని అర్ధన్నపాలెం గ్రామ సమీపంలో ఉన్న తన క్యాంపు ఆఫీస్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కడుబండి మాట్లాడుతూ తమ కూటమి అధికారంలోకి వస్తే రానున్న అయిదేళ్లలో విద్యుత్ చార్జీ లను పెంచబోమని,అవసరమైతే గతంలో పెంచిన చార్జీలను కూడా తగ్గిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే భారీగా చార్జీలు పెంచేశారని దుయ్యబట్టారు. సూపర్‌సిక్స్‌తో పాటు అనేక బూటకపు హామీలు ఇచ్చి ప్రజలతో ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీలను పక్కన పెట్టి బాదుడే బాదుడు కార్యక్రమాన్ని మాత్రం పటిష్టంగా అమలు చేస్తోందని ఎద్దేవా చేశారు.కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ.6,072 కోట్ల మేర విద్యుత్ చార్జీల భారాన్ని మోపారని, జనవరి నుంచి మరో రూ.9,412 కోట్ల భారం మోపేందుకు సిద్ధమవుతున్నారని మండిపడ్డారు. ఎస్సీ,ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ 27వ తేదీన నియోజకవర్గ కేంద్రం ఎస్.కోటలో పోరుబాట పేరిట నిరసన తెలపనున్నట్లు తెలిపారు. దేవీ జంక్షన్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పార్టీ ఎంపీపీలు,జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యక ర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ,మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ వేపాడ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగన్నాథం, కొత్తవలస, చిన్నరావుపల్లి, కంటకాపల్లి గ్రామాల సర్పంచ్‌లు మచ్చ ఎర్రయ్య రామస్వామి, బూసాల దేముడు, పీతల కృష్ణ, పార్టీ నాయకులు మదీన అప్పలరమణ, పల్లా భీష్మ, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



అకాల వర్షాలు కురుస్తున్నందున వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మరు పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ప్రజలకు సూచించారు.గజపతినగరం మండలంలోని కెంగువ గ్రామ సచివా లయంలో మంగళవారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 61మందికి వైద్యాధికారి సుష్మ, వైద్యసిబ్బంది కలిసి వివిధ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, జాగ్రత్తలు సూచించారు. – గజపతినగరం

పేదలకు దుప్పట్ల పంపిణీ



చీపురుపల్లి పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం లబ్ధిదారులతో పాటు నిరాశ్రయులకు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మా ట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏటా నిరాశ్రయులకు శీతాకాలంలో దుప్పట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. క్లబ్ ప్రతినిధులు ఎస్.సన్యాసిరావు, డి.సీతారామరాజు, పి.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. – చీపురుపల్లి

రసాయన ఎరువుల వినియోగం తగ్గించండి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ అనురాధ

దత్తిరాజేరు: మొక్కజొన్న,మిరప, పత్తి, కూరగాయల పంటలకు రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని ఏఓ అనురాధ రైతులకు సూచించారు. మండలంలోని భూపాలరాజపురంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగిస్తుండడం వల్ల పంటకు తెగుళ్లు ఎక్కువగా సోకే అవకాశం ఉందని, భూసారం దెబ్బతిని, భూమి తన సహజ స్థితిని కోల్పోతుందని అన్నారు. సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. పంటలకు బీమా చేయించుకుంటే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటకు నష్టం వాటిల్లినప్పుడు పరిహారం అందుతుందని చెప్పారు. ఆధార్ కార్డు, భూముల వన్‌బీ, భూమి పాస్ బుక్ తీసుకుని మీసేవా కేంద్రాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో బీమా ప్రీమియం చెల్లించుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నేరేడుబిల్లి గురునాయుడు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భూవిక్రయాలపై దర్యాప్తునకు డిమాండ్



చామలాపల్లిలో దళితులకు ఇచ్చిన భూములను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

వేపాడ: చామలాపల్లి గ్రామ దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ఇచ్చిన భూమికి సంబంధించి విక్రయాలపై సంబంధిత అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. చామలాపల్లి దళితులకు ఎస్సీ కార్పొరేషన్ అప్పగించిన 24 ఎకరాల భూమిని సీపీఎం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ దళితులకు ఇచ్చిన భూములను అధికారులు వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయడం అన్యాయమన్నారు. సదరు భూమిలో 40 టేకు చెట్లు అక్రమంగా నరికి విక్రయించిన వారిపై చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆభూములను తిరిగి దళితులకు అప్పగించాలని, అనుమతులు లేకుండా టేకు చెట్లు నరికి విక్రయించుకున్న వారిపై తీసుకోవాలని కోరారు. లేకుంటే జనవరి 2వ తేదీన నియోజకవర్గంలోని దళితులను సమీకరించి పోరాటం చేస్తామన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.అప్పారావు, సామాజిక కార్యకర్త అప్పారావు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

కొత్తవలస: విశాఖపట్నం-రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న ఉత్తరాపల్లి పంచాయతీ గాంధీనగర్ గ్రామ దళితులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని సీపీఎం నాయకుడు గాడి అప్పారావు డిమాండ్ చేశారు.ఉత్తరాపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ బి.నీలకంఠారావు దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. అప్పారావు మాట్లాడుతూ ఎన్నోఏళ్ల క్రితం ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో పేద దళితులు ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారని, హైవే నిర్మాణంలో భాగంగా వారు ఆ ఇళ్లు కోల్పోతున్నారని చెప్పారు.వారికి తక్షణమే వేరొక చోట స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఉత్తరాపల్లి గ్రామ రైతులకు హైవే అథారిటీ వారు సరైన పరిహారం ఇవ్వలేదని, పరిహారం పెంచేలా చూడాలని డిమాండ్ చేశారు. భూసమస్యలపై ఆరుగురు రైతులు అర్జీలు అందజేశారు.



అధికారులకు సమస్య వివరిస్తున్న సీపీఎం నాయకుడు అప్పారావు, తదితరులు

బాబు బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట

- విద్యుత్ చార్జీల బాదుడుపై ఈనెల 27న నిరసన
- పోరుబాట పోస్టర్లు విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



చీపురుపల్లి: పోరుబాట వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పి ప్రజలను నమ్మించి మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు తీరుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ అధినే త, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 27న నియోజకవర్గస్థాయిలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో విద్యుత్ చార్జీల రూపంలో ప్రజలపై చంద్రబాబు రూ.15,485 కోట్ల భారం మో పారన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు గత ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చిందని, ఆపథకాన్ని కూడా చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఎన్నిక ల సమయంలో ప్రజలకు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబు నైజమని చెప్పారు.విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 27న చీపురుపల్లి పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో మహానేత వైఎస్సార్ విగ్రహం నుంచి ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన తెలపనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరుకానున్నారని తెలిపారు. మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, పార్టీ నాయకులు పతివాడ రాజారావు, దన్నాన జనార్దన రావు, బెల్లాన త్రినాథరావు, రఘుమండ త్రినాథ, బాణాన శ్రీనివాసరావు, కోరుకొండ దాలయ్య, గవిడి సురేష్, రేవల్ల సత్తిబాబు, గిరడ రాందాసు, కొమ్ము చిరంజీవి, కర్రోతు ప్రసాద్, కంచుపల్లి అశోక్ పాల్గొన్నారు.

'పోరుబాట'ను విజయవంతం చేయండి



గుర్ల: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఈనెల27న 'పోరుబాట' పేరిట నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చీపురుపల్లిలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి మండల ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ బెల్లాన బంగారునాయుడు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



శృంగవరపుకోట: శాంతాక్లాజ్ వేషధారణలో కౌముది గ్లోబల్ పాఠశాల విద్యార్థులు



బొండపల్లి: క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు



వేపాడ: విక్టరీ స్కూల్‌లో ఏసు జననం నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

శృంగవరపుకోట/వేపాడ: ఎస్.కోటలోని కౌముది గ్లోబల్ పాఠశాల, వేపాడలోని శ్రీ విక్టరీ హైస్కూల్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శాంతాక్లాజ్ ఏంజెల్ (దేవదూత) వేషధారణలో అలరించారు. ఏసుక్రీస్తు జననంపై నాటిక ప్రద ర్శించారు. క్రిస్మస్ పాటలతో సందడి చేశారు. కౌముది పాఠశాల హెచ్ఎం శాంతి మహంతి, శ్రీ విక్టరీ హైస్కూల్ అడ్మిన్ డైరెక్టర్ రాఘ వ, కరస్పాండెంట్ దాలినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో...

బొండపల్లి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వ హించారు. ఉద్యోగులు,సిబ్బందితో కలిసి తహసీల్దార్ కేక్ కట్ చేశారు. క్రీస్తు జీవితం అందరికి ఆదర్శప్రాయమని, ఆయన చెప్పిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని తహసీల్దార్ సూచించారు.